క్లుప్తంగా

మండపాలకు అనుమతి తప్పనిసరి

వేటపాలెం: మండల పరిధిలో వినాయక చవితి పండగను పురస్కరించుకొని భక్తులు ఏర్పాటు చేసుకొనే వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. సింగిల్ విండో అప్లికేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో పోలీస్ అనుమతుల మేరకే మండపాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విగ్రహాలు నిమజ్జనానికి తరలించే ముందు పోలీసులకు ముందుగా తెలియజేయాలని తెలిపారు. ఎటువంటి గొడవలు లేకుండా శాంతి యుతమైన వాతావరణంలో పండగ జరుపుకోవాలని సూచించారు. అల్లర్లకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫిజియోథెరపీతో స్వస్థత



బల్లికురవలో పరీక్షలు నిర్వహిస్తున్న ఫిజియోథెరపిస్టు

బల్లికురవ: వైకల్యం కలిగిన 18 సంవత్సరాల్లోపు చిన్నారులతో నిత్యవ్యాయామం ఫిజియోథెరపీ పరీక్షలతో స్వస్థత పొందవచ్చని ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం బల్లికురవలోని భవిత కేంద్రంలో 12 మంది చిన్నారులకు ఆమె పరీక్షలు నిర్వహించారు. ప్రతి బుధవారం జరిగే క్యాంపుకు చిన్నారులను తీసుకురావాలన్నారు. సాధారణ పిల్లలతో సమానంగా పెంచుతూ మంచి పౌష్టికాహారం అందించాలని కోరారు. ఈ పరీక్షలో ఐఈఆర్టీ నాగబాబు, నాజిలి పాల్గొన్నారు.

జెడ్పీ స్కూల్‌కి ఖోఖో పోల్స్ బహూకరణ



ఖోఖో పోల్స్ అందిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి

వేటపాలెం: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బత్తుల సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేల విలువైన ఖోఖో పోల్స్‌ను బహూకరించినట్లు ప్రధానోపాధ్యాయుడు గుమ్మా శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలకు ఉపయోగ కరంగా ఉంటాయని తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చినగంజాం: పోషకాహారం ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



తోటవారిపాలెంలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు

చీరాల అర్బన్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. సరైన పోషక విలువలున్న ఆహారం తీసుకోకుంటే అనారోగ్యంతో పాటు రక్తహీనత బారిన పడే ప్రమాదం ఉంది. రక్తహీనతను అరికట్టేందుకు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. పోషకాహారం లోపం వలన కలిగే నష్టాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించనున్నారు. కౌమార బాలికలు, బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారంపై ప్రదర్శనలు, సామూహిక సీమంతాలను నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని వేటపాలెం ప్రాజెక్టు పరిధిలో చీరాల, వేటపాలెం మండలాలు, చీరాల మున్సిపాలిటీలున్నాయి. వీటిలో మొత్తం 277 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 1401, బాలింతలు 1222, 7 నెలల నుంచి 3 సంవత్సరాల్లోపు పిల్లలు 6355, మూడు సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల్లోపు పిల్లలు 3483 మంది ఉన్నారు. నెల రోజులు పాటు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వివిధ కార్యక్రమాలతో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు.

కార్యక్రమ వివరాలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల బరువులు, ఎత్తులు కొలుస్తారు. వీటిని పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తారు. స్థానిక పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలను గుర్తించి అవసరమైన వారికి వైద్యం అందిస్తారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారులకు అన్నప్రాసన, పోషకాహార పదార్థాల ప్రదర్శన చేపడతారు. ఐఎఫ్ఏ కాల్షియం, ఇంట్లో బలవర్థక ఆహారం తయారీని వివరిస్తారు. బరువు పెరుగుదలకు యోగా, వ్యాయామ సాధన వంటి అంశాలను సాంకేతిక ఆధారంగా పర్యవేక్షిస్తారు. అలానే స్వచ్ఛంద సంస్థలు, ప్రజలును ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తారు. ప్రసవానికి ముందు గర్భస్థ పరీక్షలు, బిడ్డ పుట్టిన గంటలో ముర్రుపాలు పట్టించడం, ఆరు నెలల వరకు తల్లిపాలు అందించడం, అనంతరం అదనపు ఆహారం అందించడం తదితర విషయాలను బాలింతలకు వివరిస్తారు. ఐదు సంవత్సరాల వరకు టీకా పట్టిక ప్రకారం టీకాలు వేయించడం, పిల్లలకు వివిధ కార్యక్రమాల నిర్వహిస్తారు.



పౌష్టికాహారం మాసోత్సవాల్లో అన్నప్రాసన నిర్వహిస్తున్న దృశ్యం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చీరాల టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి కోరారు. బుధవారం తోటవారిపాలెంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని పురస్కరించుకుని ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని విధిగా తీసుకుని క్రమం తప్పకుండా వ్యాధినిరోధక టీకాలను తీసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకుని తినే విధానాన్ని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ప్రభుత్వ సాయాన్ని పొందాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చినగంజాం: పోషకాహారం శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని అంగన్ వాడీ సీడీపీఓ టి. ఝాన్సీ అన్నారు. బుధవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా పెదగంజాం 4 ఎస్సీ కాలనీలో కార్యక్రమం నిర్వహించారు. తేలికగా తయారు చేసుకునే పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన, వంటకాల తయారీ విధానం ప్రదర్శించారు. సూపర్‌వైజర్ కె. వాణిశ్రీ, అంగన్‌వాడీ టీచర్‌లు జయలక్ష్మి, విజయలక్ష్మి, కవిత, బేబీ, పద్మ, మల్లేశ్వరి, సౌబాగ్యం, శివపార్వతి హాజరయ్యారు.

చీరాల అర్బన్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఏసీడీపీఓ ఎం.సుచిత్ర అన్నారు. బుధవారం చీరాల అర్బన్‌లోని ఉజిలిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించి వారు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. ఐరన్ టాబ్లెట్స్ గురించి, పిల్లలకు వేయించాల్సిన టీకాలు గురించి వివరించారు. ఆరు నెలలు నిండిన వెంటనే పిల్లలకు ఇచ్చే పోషకాహారాన్ని వివరించారు. సూపర్‌వైజర్ కుముద్వతి, ఏఎన్ఎం కళ్యాణి, అంగన్‌వాడీ కార్యకర్త కళావతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ



బస్టాండ్‌లో హోమియో మాత్రలు పంపిణీ చేస్తున్న హోమియో డాక్టర్, రోటరీ సభ్యులు

అద్దంకి రూరల్: విష జ్వరాలైన డెంగీ, వైరల్ జ్వరాల నివారణ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో హోమియో మాత్రలతో ప్రమాదకరమైన విషజ్వరాలను తగ్గించుకోవచ్చన్నారు. ఆర్టీసీ డీఎం రామ్మోహనరావు, హోమియో డాక్టర్ కావూరి రఘుచంద్, రోటరీ కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పసుపులేటి ఆంజనేయులు, పువ్వాడ రామకోటేశ్వరరావు, కొల్లా భువనేశ్వరీ, మన్నం త్రిమూర్తులు, ఆర్టీసీ కోటయ్య, కొల్లిపర నాగయ్య పాల్గొన్నారు.

మినుము, మొక్కజొన్న పరిశీలన



కేవీ పాలెంలో సాగుచేసిన మినుము మొక్కజొన్న పంటలు

బల్లికురవ: మండలంలోని కొమ్మినేనివారిపాలెం సాగు చేసిన మినుము, మొక్కజొన్న పంటలను సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, మార్టూరు, మండల వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి బుధవారం పరిశీలించారు. వర్షాలకు భూమిలో తేమ ఉండటంవల్ల పోషకాలు మొక్కలు తీసుకోలేవని పైపాటుగా 13-0-45 లేదా 19-19-19 పిచికారీ చేయాలని చెప్పారు. మినుము పూతదశలో ఉన్నందున మరూక మచ్చల పురుగువచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు ఉందని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 3 కిలోలు ఆకు సుడులలో వేసుకోవాలని సూచించారు. కత్తెర పురుగు పట్ల ప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ వెంకాయమ్మ, రైతులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం



జిమ్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం

చీరాల: మనిషి ఆరోగ్యవంతమైన జీవితం గడపటానికి వ్యాయామం ఎంతో అవసరమని బీవీఅండ్‌బీఎన్ గవర్నమెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్రరావు అన్నారు. బుధవారం దేవాంగపురిలోని పాఠశాలలో జిమ్‌ను ఆయన ప్రారంభించారు. పాఠశాల పూర్వ విద్యార్థి బొడ్డు శంకర్‌బాబు అందించిన రూ.25 వేల ఆర్థిక సహాయంతో వ్యాయామ పరికరాలతో జిమ్ ఏర్పాటు చేశారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి పన్నెం కోటయ్యబాబు మాట్లాడుతూ పరుగులు తీస్తున్న ప్రపంచంలో మనిషికి వ్యాయామం తప్పనిసరి అన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, పోలీస్ తదితర ఉద్యోగాలు ప్రయత్నం చేసేవారికి దేహదారుఢ్య పరీక్షలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ కె.శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయులు పన్నెం వెంకటేశ్వర్లు, ఎక్స్‌సర్వీస్‌మెన్ షేక్ జిలాని, వాకర్స్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఈలో పీహెచ్‌డీ పట్టా అందుకున్న పమిడి

చీమకుర్తి: మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామానికి చెందిన పమిడి లక్ష్మీనారాయణ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ (ఈఈఈ) ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు తెలిపారు. విజ్ఞాన్ యూనివర్శిటీలో వైస్ చాన్సిలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథ్ బాబు చేతుల మీదుగా పేసర్ మెజర్‌మెంట్ యూనిట్ ప్లేస్‌మెంట్ విత్ కంప్లీట్ అబ్జర్వబిలిటీ ఫర్ డైనమిక్ స్టేట్ ఎస్టిమేషన్ ఇన్ పవర్ సిస్టమ్ అనే అంశంపై పీహెచ్‌డీ అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కాలేజీ ప్రొఫెసర్లు అభినందించారు.

రాజ్యాంగ సవరణతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం

ఒంగోలు సెంట్రల్: ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్రపతికిగానీ, సుప్రీంకోర్టుకుగానీ రాజ్యాంగ సవరణ చేసిన తర్వాతే ఎస్సీ వర్గీకరణకు వీలుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 11న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితికి మద్దతుగా ఒంగోలులో నిర్వహించనున్న ర్యాలీకి ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చెయ్యాలని కోరారు. క్రిమిలేయర్ వలన అన్నదమ్ములుగా కలిసి ఉన్న మాలమాదిగలకు ఇద్దరికీ అన్యాయం జరుగుతుందన్నారు. నూతనంగా ఒంగోలు పట్టణ అధ్యక్షురాలిగా నామాల షకీలాను ఎంపిక చేసినట్లు చెప్పారు. బత్తుల వెంకటరావు, బత్తుల సుబ్రహ్మణ్యం, మున్నార్ మహేష్, చలువాది రాజా పాల్గొన్నారు.

అలరించిన ‘నీ గానమే నా ప్రాణము’



నామ సంకీర్తన చేస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ది కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో 42వ నీ గానమే నా ప్రాణము కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గోపూజా, జ్యోతిప్రజ్వలన అనంతరం అఖండ నామ సంకీర్తన కార్యక్రమాన్ని జరిపించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి అనేక మంది పూజ గురుస్వాములు, అయ్యప్ప స్వాములు, గాయకులు పాల్గొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆధ్యాత్మిక భక్తి గీతాల ఆలాపన కార్యక్రమం జరిగింది. అనంతరం గురుస్వాముల ఆత్మీయ సమ్మేళనం, అతిథి సత్కారం, మహామంగళహారతి, పవళింపు సేవతో కార్యక్రమం ముగిసింది. అన్నప్రసాద వితరణను చీరాల అయ్యప్ప భజన బృందం సమైఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన వీరాంజనేయులు

జె.పంగులూరు: మండలంలోని 16 వ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముప్పవరం గ్రామానికి చెందిన ఇంటూరి ఆంజనేయులు ఉరఫ్ స్వామి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. 16 వ నెంబర్ జాతీయ రహదారిలో టూవీలర్ పై బైటమంజులూరు వెళుతున్న ఇంటూరి వీరాంజనేయులు అనే వ్యక్తిని, ఆదే రహదారిలో వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో వీరాంజనేయులు తీవ్ర గాయాలయ్యాయి. తలకు బలమైన గాయాలు తగలటంతో చికిత్స నిమిత్తం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కి తరలించారు. లారీని అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రిన్సిపాల్ పుష్పరాజ్‌కు సత్కారం



ప్రిన్సిపాల్ పుష్పరాజ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

చీరాల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా చీరాలలోని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పుష్పరాజ్‌ను ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోని బాబు జగ్జీవన్ పీఠం పరిశోధకులు తేళ్ల రాంబాబు బుధవారం సత్కరించారు. ఎంతో మందికి ఉచిత విద్య, ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తూ సహాయ సహకారాలు అందించి సమాజంలో ఉన్నత స్థానంలో నిలిపిన ఘనత ఆయనదన్నారు. భవిష్యత్తులో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

అద్దంకి రూరల్: గురువులను గౌరవించటం అందరి బాధ్యత అని ఎంఈవో గంగాధర్ అన్నారు. గురు పూజోత్సవం సందర్భంగా బుధవారం పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మారం వారి సేవా సదన్‌లో విద్యారంగంలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కోవి మల్లిఖార్జునరావు, పాములపాటి రాజశేఖర్, సందిరెడ్డి శ్యామలాదేవి, శానంపూడి నాగమల్లిక, మానికొండ ధనలక్ష్మీలకు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పురస్కార ద్రవ్యంతో తోపాటు నూతన వస్త్రాలు, సన్మాన పత్రం, మెమొంటో ఇచ్చి గౌరవించారు. కార్యక్రమంలో వారణాసి రఘురావమశర్మ, చుండూరి మురళీ సుధాకరరావు, చప్పిడి వీరయ్య, లక్కరాజు శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవీ ప్రసాద్ పాల్గొన్నారు.



అద్దంకిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్, ట్రస్ట్ సభ్యులు

రక్తదానంపై అవగాహన అవసరం

చీరాల: విద్యార్థులు రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని ఏఓ ప్రసాద్ అన్నారు. చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలోని శ్రీవిద్యాభారతి స్మార్ట్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. రక్తదానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. రక్తదానం వలన మరొకరికి ప్రాణదానం చేయవచ్చని ప్రిన్సిపాల్ రామ్మోహనరావు వెల్లడించారు. శిబిరంలో పురుషుల కంటే మహిళలలే రక్తదానం చేయడం గమనార్హం. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి మృతి

నాగులుప్పలపాడు (మద్దిపాడు): మనస్తాపం చెందిన యువతి ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన నాగులుప్పలపాడు మండలంలోని చీర్వానుప్పలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బత్తుల శిరీష (28) భర్త అంకయ్య సంవత్సరం క్రితం గుండెపోటుతో చనిపోయాడు. కొంతకాలంగా మనస్తాపం చెంది పరధ్యానంగా ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో పిల్లలు నిద్రించిన తర్వాత ఉరి వేసుకుని మృతి చెందింది. ఎస్సై బి.శ్రీకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై యువకుల దౌర్జన్యం

మార్టూరు: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ముగ్గురు యువకులు దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించారు. ఈ విషయమై కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సైదా బుధవారం రాత్రి తెలిపారు. గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో సర్వీస్ రోడ్డులో మార్టూరు వైపు వస్తోంది. ఈ క్రమంలో స్థానిక చైతన్య స్కూల్ సమీపంలో బస్సుకు ఎదురుగా రెండు బైకులపై ముగ్గురు యువకులు మితిమీరిన వేగంతో బస్సు వైపు వస్తుండగా బస్సు డ్రైవర్ గంటా రవికుమార్ ముందు జాగ్రత్తగా హారన్ మోగించారు. తమను చూసి డ్రైవర్ హారన్ కొట్టడాన్ని భరించలేని ఆ యువకులు తమ బైకులను బస్సు సమీపంలో ఆపారు. వారిలో బత్తినేని శ్రీనివాసరావు అనే యువకుడు బస్సు లోపలికి వెళ్లి డ్రైవర్‌పై దౌర్జన్యానికి దిగగా అతని స్నేహితులు గొర్రె వేణు, గజ్జల సాంబశివరావులు సైతం బస్సును ఆపివాదనకు దిగారు. ఎంత వారించినా ఆ ముగ్గురూ బస్సును కదలనిచ్చే పరిస్థితి లేకపోవడంతో బస్సు కండక్టర్ కొలకలూరి దీవెన కుమారి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్టూరు బలరాం కాలనీకి చెందిన ఆ ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని నోటీసులు ఇచ్చి పంపించినట్లు ఏఎస్ఐ సైదా తెలిపారు.

నీటి పన్ను వసూలు చేయాలి

- డీపీఓ ఉషారాణి



ఈఓపీఆర్‌డీ రఘుబాబుతో మాట్లాడుతున్న డీపీఓ ఉషారాణి

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామంలో నీటి పన్ను వసూలు చేసి వెంటనే టర్న్‌కాక్‌కు, వర్కర్లకు జీతాలిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్‌డీ రఘుబాబును డీపీఓ టి.ఉషారాణి ఆదేశించారు. బుధవారం దొడ్డవరం గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దొడ్డవరం విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిపాలనను గాడిలో పెట్టాలన్నారు. గ్రామస్తులు పలువురు గ్రామంలోని సమస్యలను ప్రస్తావించగా.. వారితో మాట్లాడారు. దొడ్డవరం గ్రామ పంచాయతీ టర్న్‌కాక్ సుబ్బరాయుడు తనకు 8 నెలలుగా జీతం ఇవ్వలేదని, ఇంటి వద్ద సమస్యలు ఉన్నాయని డీపీఓకు వినతిపత్రం ఇచ్చారు. నీటి సమస్యకు సంబంధించి గతంలో జరిగిన తప్పులు వదిలేసి 2024 జనవరి నుంచి నీటిపన్ను వసూలు చేస్తే సమస్య కొంతవరకూ తీరుతుందని ఆమె తెలిపారు. నీటి పన్ను వసూలు చేసేందుకు వ్యక్తిని నియమించడానికి చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్‌డీకి తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో నీటి పన్ను వసూలు చేసేందుకు ఒక వ్యక్తిని తీసుకోవాలని గ్రామస్తులు కూడా కోరడంతో.. త్వరలో పంచాయతీలో అత్యవసర గ్రామ సభ నిర్వహించి నీటి పన్ను వసూలు చేసేందుకు వ్యక్తిని తీసుకుంటామని, వచ్చిన డబ్బుతో టర్న్ కాక్, ఇతర వర్కర్ల జీతాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సెక్రటరీ లతీఫ్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.